క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోను ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



పాత గుంటూరు: కొత్తపేటలోని కుగ్లర్ హాస్పిటల్ ఆవరణలోని ట్రినిటీ గురు మండలం (చర్చి)లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. లూథరన్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు నామాన్ని, త్యాగాన్ని గానం చేస్తూ మట్టలతో కొత్తపేట, రామిరెడ్డిపేట తదితర ప్రాంతాలలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చిలో రెవరెండ్ జె. ఆశీర్వాదం, రెవరెండ్ వి. క్రిష్టఫర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బి. గ్రేస్ సుదర్శనం, బి.లెనిన్, బి.విల్సన్, టి.రాజేష్ పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ ప్రకటన కోరుతూ ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా డీఈవో కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతున్నట్లు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, టీచర్ అభ్యర్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

అలరించిన వీణా నాదార్చన



పాత గుంటూరు: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా స్తంభాలగరువు శ్రీ కోదండ రామ స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం అభిషేకం, విశేష పూజలు జరిపారు. రాత్రి పుష్పాభిషేకం నిర్వహిస్తుండగా, శ్రీ భారతీ సంగీత నిలయం వ్యవస్థాపకులు, వీణాగాన ప్రపూర్ణ ఏ. భారతీదేవి శిష్య బృందం కె. నాగలక్ష్మి, భవాని, సాయిలక్ష్మి వీణా నాదార్చన చేశారు. మహా గణపతిం కీర్తనతో ప్రారంభించి మరుగేలరా ఓ రాఘవ, వినవయ్య రామా అంటూ అనేక కీర్తనల్ని వీనుల విందుగా పలికించారు. వీరికి మృదంగంపై జగన్మోహిని చక్కని వాయిద్య సహకారాన్ని అందించారు.

సప్తశతి పారాయణం సకల పుణ్య ఫలప్రదం



పాత గుంటూరు: దేవీ సప్తశతి పారాయణ సకల పుణ్యాల్ని చేకూర్చి పెడుతుందని మహా సహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ తెలిపారు. సంపత్ నగర్ శ్రీ శారదా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో శ్రీ దేవీ సప్తశతిపై ఆదివారం ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. నాగఫణిశర్మ ప్రవచనం చేస్తూ దేవీ సప్తశతి అమ్మవారి శక్తికి నిదర్శనం అని వివరించారు. అమ్మవారి స్తుతులు, స్తోత్రాల్ని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు పాల్గొన్నారు.

అలరించిన అనుష్క కూచిపూడి నృత్యం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై రాధా మాధవ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 299వ నెలనెలా వెన్నెల కార్యక్రమం నిర్వహించారు. రాధామాధవ నాట్యక్షేత్రం నాట్యాచార్య షేక్ ఖలీల్ నిర్వహణలో గురజాలకు చెందిన పులుసు అనుష్క ఆనంద ఆరంగేట్రం చేసింది. రంగ పూజ, గంగం గణపతి, బ్రహ్మాంజలి, కొలువై వున్నాడే, భావములోన, నందనందన, అయిగిరి నందిని, తిల్లాన అంశాలకు కూచిపూడి నృత్యాన్ని నయనమనోహరంగా ప్రదర్శించింది. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, కళాభిమానులు పాల్గొని అనుష్క ఆనందను అభినందించారు.

మహిళా సాధికారిత సీఎం జగన్‌తోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా



హాజరైన మహిళలు

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థికంగా ఎదిగేలా, వారి స్వయం జీవనోపాధికి అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు చెప్పారు. నియోజకవర్గంలోని 50వ డివిజన్ శారదాకాలనీలో ఆదివారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరాతో మహిళలంతా సాధికారిత సాధించవచ్చని తెలిపారు. డ్వాక్రా బృందాలన్నీ పొదుపు చేసుకుని, ప్రభుత్వం నుంచి రుణాలు తీసుకొని చిరు వ్యాపారాలు నిర్వహించకోవాలని సూచించారు. చెప్పిన విధంగా సీఎం వై.ఎస్. జగన్ వైఎస్సార్ ఆసరాతో రుణాలు మాఫీ చేస్తున్నారని ఎమ్మెల్యే ముస్తఫా పేర్కొన్నారు. డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్ మహిళా పక్షపాతి అని చెప్పారు. అన్ని రంగాల్లో వారికి పెద్దపీట వేయడంతో పాటు పదవులు, ప్రాతినిధ్యాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ ఆసరా కింద 50వ డివిజన్‌లో 150 గ్రూపులకు రూ. 88లక్షల వరకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత నూరిఫాతిమా, డివిజన్ కన్వీనర్ రాజేష్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కీళ్ల మార్పిడి ఆపరేషన్లపై అపోహలొద్దు

డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి



సభలో మాట్లాడుతున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

లక్ష్మీపురం: కీళ్ల మార్పిడి ఆపరేషన్లపై అపోహలు వద్దని, తీవ్రంగా మోకాళ్ల నొప్పులు ఉన్నవారు మిగతా జీవితాన్ని సౌకర్యవంతంగా గడిపేందుకు తప్పనిసరిగా ఆపరేషన్లు చేయించుకోవాలని సాయి భాస్కర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. బ్రాడీపేటలోని తాలుకా ఆఫీసు కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆవరణలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో 230వ ఆరోగ్య సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ అధిక బరువు, మారిన జీవన విధానంతో ఒత్తిడి, కాల్షియం లోపం, మధుమేహం రక్తపోటు వంటి కారణాలతో 50 ఏళ్లు దాటిన వారిలో కీళ్ల అరుగుదల ఉంటుందని తెలిపారు. సమస్యను గుర్తించేందుకు తప్పనిసరిగా ఎముకల వైద్యుల్ని సంప్రదించి నిర్ణీత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆపరేషన్ అంటే భయపడి నొప్పుల మాత్రల్ని పదేపదే వాడి మూత్ర పిండాలు, గుండె జబ్బులు, కాలేయం, జీర్ణ కోశ సమస్యల బారిన పడొద్దని చెప్పారు. ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న అశాస్త్రీయ పద్ధతులతో సమస్యను తీవ్రతరం చేసుకోవద్దని తెలిపారు. ఎముకల అరుగుదల మొదటి, రెండో దశల్లో వైద్యుల సూచనలతో వ్యాయామం, మందులు సరిపోతాయన్నారు. మూడు, నాలుగు దశల్లోనే శస్త్ర చికిత్స అవసరమని చెప్పారు. అనంతరం డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డితో పాటు ఆయన తండ్రి మల్లేశ్వరరెడ్డిని సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రభుదాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, కృష్ణయ్య, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులూ.. ఆల్ ది బెస్ట్!



విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ తెలియజేస్తున్న మేయర్, కార్పొరేటర్లు

నెహ్రూనగర్: టెన్త్ విద్యార్థులంతా ఒత్తిడి గురికాకుండా పరీక్షలు హాజరుకావాలని గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలు, కావటి శంకరరావు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో 10వ తరగతి పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థుల్ని ఆదివారం మేయర్ కలసి ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష హాలులో గాబరా పడకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. కేంద్రానికి నిర్దేశించిన సమయం కంటే ముందుగానే చేరుకోవాలని తెలిపారు. నగరపాలక సంస్థ హైస్కూలు విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి ఫస్ట్ క్లాసు మార్కులు సాధించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పోతురాజు సమత, వేములపల్లి జ్యోతి పద్మజ, నిమ్మల వెంకట రమణ, గేదెల నాగ రంగమణి, గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా పాల్గొన్నారు.

మహిళపై దాడి

గుంటూరు ఈస్ట్: మహిళపై ఇద్దరు దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నాయుడుపేటకు చెందిన కల్యాణి, ఆమె తమ్ముడు సాయి పాత కక్షల నేపథ్యంలో గతనెల 30న దరియాబీపై దాడి చేశారు. ఆమె మెడలోని బంగారు గొలుసు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. దరియాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో వ్యక్తి అరెస్టు

బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. బ్రాడీపేట 4వ లైనుకు చెందిన రాగిరి సాకేత్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయిన బాలికను ప్రేమ పేరుతో వెంటాడి వేధించి లైంగికగా దాడి చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఆదివారం సాకేత్‌ను అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

బాలిక అదృశ్యం

బాలిక అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కేవీపీ కాలనీలోని ఓ కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలిక ఇంట్లో చెప్పకుండా గత నెల 31న ఎటో వెళ్లిపోయింది. బాలిక కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌కు చెందిన జిక్కుల వెంకట కృష్ణకు విజయవాడకు చెందిన బోండాల గోపీతో కొద్దికాలం కిందట పరిచయం అయింది. గోపీ కృష్ణ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి వెంకట కృష్ణ నుంచి పలు విడతలుగా రూ. 3,90,000 తీసుకున్నాడు. తాను మోసపోయానట్లు గుర్తించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న వలి

పాత గుంటూరు: కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్ శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. సాయంత్రం నరసరావుపేటకు చెందిన షేక్ వలి ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఆర్టిస్ట్ శివ మిమిక్రీ హాస్యభరితంగా సాగింది. కార్యక్రమాల్ని ఆలయ అధ్యక్షుడు కొమ్మినేని శివ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కిలారి ఆదినారాయణ, కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, పి. శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పార్టీ పటిష్టానికి కృషి చేయాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు

గుంటూరు మెడికల్: ఏపీలో భారతీయ జనతా పార్టీ వ్యాప్తికి క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పిలుపునిచ్చారు. గుంటూరులోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీర్రాజు మాట్లాడుతూ మూడు నుంచి ఆరు పోలింగ్ బూత్‌లను ఒక శక్తి కేంద్రంగా గుర్తించాలని, దానికి ప్రముఖ్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్రంలోని శక్తి కేంద్రాల్ని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెలలో పాదయాత్ర నిర్వహిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్రం సహాయం ఎంతో ఉందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడం ముఖ్యమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆంధ్రప్రదేశలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకృష్ణ, మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, ఆలపాటి రవికుమార్, జూపూడి రంగరాజు, యడ్లపాటి స్వరూప రాణి, చందు సాంబశివరావు పాల్గొన్నారు.

తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలి

గుంటూరు మెడికల్: ఉత్తరాంధ్ర జిల్లాల్లో మాత్రమే అమలవుతున్న తూర్పు కాపుల ఓబీసీ రిజర్వేషన్లను రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా అమలు అయ్యేలా చూడాలని పలువురు తూర్పు కాపు సంఘం నేతలు ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజును గుంటూరులో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో నివసించే తూర్పు కాపులకు రిజర్వేషన్లు అమలుకాకపోవడం బాధాకరమన్నారు. దీనివల్ల తూర్పుకాపు యువత విద్య, ఉపాధి, ఆర్థిక రంగంలో నష్టపోతున్నట్లు వెల్లడించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో తూర్పు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకోటి ప్రసాద్, గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి వంజరపు దేవీ ప్రసాద్, నగర ఉపాధ్యక్షుడు రేజేటి శేఖర్, బి.రాంబాబు, కె.అప్పలనాయుడు, బీజేపీ నేతలు జూపూడి రంగరాజు, అప్పిశెట్టి రంగా, పాటిబండ్ల రామకృష్ణ, డాక్టర్ చనకాయల ఉమాశేఖర్, ఈమని మాధవ రెడ్డి, తోట రామకృష్ణ ఉన్నారు.

అహింసా రన్‌లో విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

పాత గుంటూరు: మహావీర్ జయంతి పురస్కరించుకుని దేశంలో శాంతి, అహింస నెలకొల్పేందుకు జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో 'అహింసా రన్' పేరుతో పరుగు పందెం నిర్వహించారు. రింగు రోడ్డులోని జేకేసీ కళాశాల ఆవరణ నుంచి కొరిటెపాడు సర్కిల్ వరకు నిర్వహించిన రన్‌ను ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పాల్గొని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొని రన్‌లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సంఘ ప్రధాన కార్యదర్శి జుగ్రాజ్ భండారి, కోశాధికారి నరేష్ హుండియా, ఉపాధ్యక్షుడు రాజేష్ కుమార్చండా, చాప్టర్ సభ్యులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి సాహిత్యం దోహదం

■ 'కవి మిత్రుల కలయిక'లో వక్తలు



కావూరి సత్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

పాత గుంటూరు: సాహిత్యం సమాజాభివృద్ధికి, దేశ పురోగతికే కాకుండా సమాజంలో పలు రుగ్మతల్ని రూపుమాపుతుందని ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ అన్నారు. బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓ హాలులో ఆదివారం ఉదయం నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ' కవి మిత్రుల కలయిక 'లో భాగంగా కవి సమ్మేళనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. సభకు సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో కవికి, రచయితకు ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ అజరామరమేనని చెప్పారు. అనంతరం కవి సమ్మేళనంలో ఉత్తమ కవిత చదివిన రేపల్లె రాజకృష్ణను, అతిథి కావూరి సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, కవి జానీబాషా, పింగళి భాగ్యలక్ష్మి, బండారు సురేష్ బాబు, సుభాష్ చంద్రబోస్, లెనిన్ శ్రీనివాస్, బి.సత్యనారాయణ, బి. జనార్దనరెడ్డి, మన్నవ వెంకట గురువు, కె. విజయ్ కుమార్, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బండికల్లు జమదగ్ని పర్యవేక్షించారు.

సరస్వతీ మాత విగ్రహాల ఆవిష్కరణ



సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలు, కావటి శంకరరావు మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూలులో ఆదివారం వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు ఏర్పాటు చేసిన విగ్రహాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ మణికంఠ గుంటూరు, మహిళా శక్తి గుంటూరు సభ్యులు నగరంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, భవిష్యత్‌లో మరిన్ని ప్రజోపయోగకరమైన పనులు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు గోనుగుంట్ల జయంత్ కుమార్, గిరిజా శాంత ప్రసాద్, బోలిశెట్టి వెంకటేశ్వరరావు, జుజ్జూరి శ్రీనివాసరావు, మాజేటి మణికంఠ ప్రసన్న, మాజేటి స్వాతి, పారేపల్లి శ్రీనివాసరావు, పారేపల్లి మంజుల, పోలిశెట్టి నాగరాజు, పోలిశెట్టి దుర్గాభవాని, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పోతురాజు సమత, వేములపల్లి జ్యోతి పద్మజ, నిమ్మల వెంకట రమణ, గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయకర్ సిద్ధాంతాలు దేశానికి అవసరం

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: ప్రస్తుతం దేశ సాంస్కృతిక రంగంలో అవాంఛనీయ పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు పెరియార్ రామస్వామి నాయకర్ సిద్ధాంతాలు ఎంతో అవసరమని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. అంబేడ్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న గుంటూరులోని రెవెన్యూ భవనంలో పెరియార్ రీడర్ పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బ్రాడీపేటలోని ఒక హోటల్‌లో ఆదివారం సభ ఆహ్వాన పత్రికను డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.విల్సన్, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి సంస్థ సభ్యుడు ఆలోకం పెద్దబ్బాయి, జొన్నలగడ్డ రామారావు, కవి ఎస్.ఎం .సుభాని, తాటికొండ నరసింహారావు పాల్గొన్నారు.

హాస్టల్ అభివృద్ధికి ఆర్థిక సహకారం

రాజ్యసభ మాజీ సభ్యుడు సుజనా చౌదరి



బసవపున్నయ్యను గజమాలతో సత్కరిస్తున్న సుజనా చౌదరి, కృష్ణప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజహితం, అభివృద్ధి కోరుకునేవారు కమ్మవారని రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి సుజనా చౌదరి పేర్కొన్నారు. అరండల్‌పేట 4వ లైనులోని కమ్మ బాలుర వసతి శతాబ్ది ఉత్సవాల్ని ఆదివారం నిర్వహించారు. హాస్టల్ పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుజనా చౌదరి మాట్లాడుతూ వందేళ్ల కిందట దాతల సహకారంతో ప్రారంభించిన వసతి గృహం వేలాదిమంది ఆకలి తీర్చిందని తెలిపారు. ఎందరో విద్యావంతులుగా ఎదిగి దేశ, విదేశాల్లో ప్రముఖులుగా రాణించారని పేర్కొన్నారు. హాస్టల్ అభివృద్ధికి పదేళ్ల పాటు ప్రతి ఏడాది రూ.ఐదు లక్షల్ని సుజనా ఫౌండేషన్ ద్వారా అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, డైనింగ్ హాలు, ఏసీ వసతులు కల్పించడంలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థుల్లో ఏటా ఒకరికి తమ మెడికల్ కళాశాలలో ఉచిత సీటును కేటాయిస్తామని తెలియజేశారు. దాతలు అందిస్తున్న సహకారంతో విద్యార్థులు నచ్చిన రంగంలో ఉన్నతంగా రాణించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం తమ బాధ్యతగా అందిస్తున్న చేయూత అభినందనీయమని చెప్పారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యతలు చాలా అవసరమన్నారు. కమ్మ విద్యార్థులు సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని హితవు పలికారు. హాస్టల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రొఫెసర్ యలవర్తి నాయుడమ్మ, మోటూరి హనుమంతరావు, సినీ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ యడ్లపాటి వెంకట్రావు సహా అనేకమంది వసతి గృహంలో చదువుకుని ఆయా రంగాల్లో ప్రముఖులుగా వెలుగొందారని చెప్పారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏడాది పాటు విద్యార్థులతో పర్యావరణం, ఆరోగ్య, సేవ కార్యక్రమాల్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల వెబ్‌సైట్‌ను సుజనాచౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు మద్దినేని గోపాలకృష్ణయ్య, రాయపాటి శ్రీనివాస్, యలమంచిలి శివాజీ, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాదల రత్నగిరి బాబు, డాక్టర్ పాపినేని శివశంకర్, కార్యదర్శి మందలపు బంగారు బాబు, సహాయ కార్యదర్శి కొరప్రాటి రామారావు, కోశాధికారి బొల్లెపల్లి శ్రీనివాసరావు, పంచుమర్తి సుశీల, పలువురు పూర్వ విద్యార్థులు, నగర ప్రముఖులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు

అన్నదానం పుణ్య కార్యం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: కులమతాలకు అతీతంగా శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తూ అన్నదానం చేయడం పుణ్యకార్యమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. పాత గుంటూరు తమ్మారంగారెడ్డినగర్‌లో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్నదానాన్ని ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నేత నూరిఫాతిమా ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కమిటీ సభ్యులు కీసరి ఆదినారాయణరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బులు, లక్ష్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్రిస్టియన్ శ్మశానవాటికలో వసతుల కల్పన

గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని క్రిస్టియన్ శ్మశానవాటికలో వసతుల కల్పించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అధికారుల్ని ఆదేశించారు. ఆదివారం పాత గుంటూరు సుద్దపల్లి డొంక రోడ్డులోని క్రిస్టియన్ శ్మశానవాటికల్ని ఆయన పరిశీలించి, గుడ్ ఫ్రైడే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని అధికారులకు సూచించారు. వ్యర్థాలు తొలగించి, శుభ్రత పాటించాలని, నీటి వసతి కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మీరావలి, ఆబీద్‌బాషా, వంశీ బాబు, వైఎస్సార్ సీపీ నేతలు జాన్‌బాబు, అనిల్‌కుమార్, సాల్మన్, టోపీబాబు, పున్నారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.